# బాలమిత్ర

- వాసంతి మాఘుపు.

**పద్యము: వగువకు గడిచిన దానికి**
**బొగడకు దుర్మతులనెపుడు పొసగని పన్నికై**
**యెగి దీనత నొందకుమీ**
**తగ దైవగతిం బొసంగు ధరను కుమారా!**

వగుచు = విచారించు;
దుర్మతులు = దుష్టులు;
పొసగని పని = సాధ్యము కాని పని;
దీనత నొందు = చింతించు;

కుమార శతకములోని ఈ పద్యము - గతమును గురించి చింతించడము తగదని, ప్రస్తుతము గురించి ఆలోచన చేయడం ఉచితమని, ఉన్నదానితో తృప్తి చెందమని తెలియజేస్తుంది.

**అర్థం: గడిచిన దానికి వగువకు;**
అనగా జరిగిపోయిన వాటికొఱకు విచారించకు.
**దుర్మతులనెపుడు బొగడకు;**
అనగా దుష్టులను మెచ్చుకొనవద్దు.
**పొసగని పన్నికై యెగి దీనత నొందకుమీ;**
అనగా సాధ్యము కానిదానిని పొందలేక పోతినని దైన్యమును పొందవలదని భావము.
**తగ దైవగతిం బొసంగు;**
అనగా భగవంతుడు ఇచ్చిన దానితో తృప్తి చెందుమని అర్థము.

* * *

**పద్యము: ఆకొన్న కూడె యమృతము**
**తాకొంచక నిచ్చువాడె దాత ధరిత్రిన్**
**సోకోర్చువాడె మనుజుడు**
**తేకువగలవాడె వంశతిలకుడు సుమతీ!**

ధరిత్రిన్ = లోకములో;
ఆకొన్న = ఆకలి సమయమున;
కూడె = అన్నమే;
అమృతము;
తాకొంచక = బాధ నొందకుండా;
ఇచ్చువాడె దాత;
సోకోర్చువాడె = ఆవేశమును ఓర్చుకొనువాడే;
మనుజుడు = మానవుడు;
తేకువగలవాడె = ధైర్యము కలవాడు;
వంశతిలకుడు = వంశమున శ్రేష్ఠుడు;

## పదమేంటో చెప్పుకోండి!

క్రింద ఇచ్చిన ఆధారములనుపయోగించి పదమేంటో చెప్పుకోండి!

1. ఇది 4 అక్షరముల (ఒక వ్యక్తి) పేరు.
2. క్షీరసాగర మథన సమయములో పుట్టిన అనేకములలో ఒకటి. ఆయుర్వేదానికి అధిష్ఠాన దేవత.
3. నవరత్నములలో ఒకరు.

**ఏమిటా పేరు?**

1. ఇది 3 అక్షరముల పదము.
2. చేయి.
3. తొండము.

**ఏమిటా పదము?**

(సమాధానములు వచ్చే సంచికలో)

గత సంచికలోని '**సమాధానం చెప్పగలరా?**' సమాధానములు.

1. రామాయణములో రామునికి ఆప్తుడు; దుష్యంతుడు, శకుంతల యొక్క పుత్రుడు; **భరతుడు**.
2. బృహస్పతికి అర్ధాంగి; అంగదుని తల్లి; **తార**.

**సామెతలు:** పిండి కొద్దీ రొట్టె.
ఎంత చెట్టుకు అంతగాలి.

*తప్పు- ఒప్పు: భాద అని వ్రాయడం తప్పు. బాధ అని వ్రాయడం ఒప్పు.*

# గురు సందేశము



ఒకసారి ఒక గురువుగారు తన శిష్యులతో దగ్గరలోనున్న అడవికి వెళ్ళారు. నడుస్తూ నడుస్తూ ఒక చోట కొన్ని చిన్న మొక్కలను, కొన్ని ఒక మాదిరి మొక్కలను, కొన్ని ఎదిగిన మొక్కలను, కొన్ని చెట్లను గమనించారు. తన శిష్యులకు చక్కని నీతిని తెలుపగోరి, ఆ ప్రదేశములో నిలుచున్నారు. శిష్యులందరూ గురువుగారి చుట్టూ చేరారు.

గురువుగారు తన మనసులో చెప్పవలసిన విషయమును గురించి పథకమును ఏర్పరచుకొని, కొంతమంది శిష్యులను పిలచి, చిన్న మొక్కలను పెకలించమని ఆజ్ఞాపించారు. శిష్యులు తృటిలో ఆ కార్యమును నెరవేర్చారు. గురువుగారు మరికొంత-



మంది శిష్యులను పిలచి, వారిని ఒక మాదిరిగా పెరిగిన మొక్కలను పెకలించమని ఆదేశమును జారీచేయగా, శిష్యులు ఆ పనిని సుళువుగానే పూర్తిచేసారు. అనంతరము గురువుగారు మరి కొంతమంది శిష్యులను పిలచి, వారిని బాగా ఎదిగిన మొక్కలను పెకలించమని ఆనతినివ్వగా, శిష్యులు కొలది కష్టముతో ఆ కార్యమును నిర్వర్తించారు. పిమ్మట మిగిలిన శిష్యగణము గురువుగారి ఆజ్ఞమేరకు బాగా పెరిగిన చెట్లను పెకలించడానికి ప్రయత్నించి విఫలమయ్యారు. కనీసం ఆ చెట్టును ఊపలేకపోయారు.

అప్పుడు గురువుగారు శిష్యులకు ఈ విధముగా నీతి బోధచేసారు. "చూడండి పిల్లలూ! మొక్కలను పెకలించడం చాలా సులభమైన పని. కాని చెట్లను పెకలించడం కష్టం. అలాగే మనకున్న చెడు అలవాట్లను మొదటిలోనే మానుకోగలిగితే ఇబ్బంది ఉండదు. అవి బాగా బలపడిన తరువాత వాటిని మానుకోవడం కష్టసాధ్యమౌతుంది. ఈ విషయమునే మన పెద్దలు 'మొక్కై వంగనిది, మ్రానై వంగునా?' అని అంటూ ఉంటారు."

***ఈ కథ వలన నేర్చుకున్న నీతి ఏమిటి?***

మనలో ఏర్పడిన చెడు అలవాట్లను మొక్కగా ఉన్నప్పుడే త్రుంచివెయ్యాలి. అవి బలాన్ని పుంజుకున్న తరువాత వాటిని వదిలించుకోవడం కష్టసాధ్యము.

**శ్రీ హయగ్రీవస్తుతి:**

జ్ఞానానంద మయందేవం
నిర్మలం స్ఫటికాకృతిం
ఆధారం సర్వవిద్యానాం
హయగ్రీవ ముపాస్మహే.

*